


మన
# భానుపురి
ఇది సూర్యాపేట వార్తల ఉషాకిరణం

శుక్రవారం 28 ఆగష్టు 2026 ఎడిటర్ :- బచ్చు పురుషోత్తం పేజీలు :- 2




# శ్రీ సంతోషిమాత జన్మదిన వేడుకలకు సర్వం సిద్ధం

భానుపురి/సూర్యాపేట కల్చరల్

శ్రీ విఘ్నేశ్వరుని మానస పుత్రిక శ్రీ సంతోషిమాత జన్మదిన వేడుకలకు సర్వం సిద్ధం చేశారు. 3 రోజుల పాటు అత్యంత వైభవో పేతంగా జన్మదిన వేడుకలు జరుపుచున్నారు. సూర్యాపేట జిల్లా కేంద్రంలో శ్రీ సంతోషి మాత ఆలయం 1995 జులై నెలలో ప్రతిష్టించుకొని ఆనాటి నుండి నేటి వరకు సూర్యాపేట జిల్లా నుండే కాకుండా పరిసర జిల్లాలతో పాటు ఆంధ్రప్రదేశ్ నుండి సైతం భక్తులు విచ్చేసి అమ్మవారిని దర్శించేందుకు వస్తుంటారు. ఉత్సవాల్లో భాగంగా 2 వ రోజు గురువారంఉదయం 9.30 గంటలకు పీఠపూజ ఉదయం 10.00 గంటలకు మహాగణపతి ,లక్ష్మీగణపతి ,నవగ్రహ సహిత లలిత సహస్రనామ హోమం నిర్వహించారు. సాయంకాలం 6.00 గంటలకు పీఠపూజ, సాయంత్రం 6.30 గంటలకు మహాగణపతి, లక్ష్మీ గణపతి, నవగ్రహ సహిత రుద్ర హోమం నిర్వహించారు.






**నేడు శుక్రవారం అమ్మవారి జన్మదినం(రాఖీ పౌర్ణమి)**

రాఖీ పౌర్ణమి అమ్మవారి జన్మదిన సందర్భంగా తెల్లవారుజాము 6 గంటల నుండి 8 గంటల వరకు అమ్మవారికి ప్రత్యేక అభిషేకాలు నిర్వహించనున్నారు. ఉదయం 10 గంటలకు భక్తుల సమక్షంలో అమ్మవారికి రాఖీ కట్టి,రాఖీ ఉత్సవం నిర్వహించి భక్తులు ఒకరినొకరు రాఖీలు కట్టుకొనున్నారు. పుట్టినరోజు పురస్కరించుకొని ఉద్యాపన వ్రతం, సామూహిక వడిబియ్య కార్యక్రమం, మహా పూర్ణాహుతి నిర్వహించనున్నారు. రాత్రివేళ అమ్మవారికి నామకరణ మహోత్సవం, పవళింపు సేవ కార్యక్రమం నిర్వహించి జన్మదిన వేడుకలు పరిసమాప్తి చేయనున్నారు.

**భక్తులు అమ్మవారిని దర్శించుకొని తరించండి**

ఈ జన్మదిన వేడుకల్లో భక్తులు అధిక సంఖ్యలో పాల్గొని అమ్మవారిని దర్శించుకుని తరించగలరనీ కమిటీ సభ్యులు తెలిపారు. ఈ పూజా కార్యక్రమంలు దేవాలయం అర్చకులు ఇరువంటి శివరామకృష్ణ శర్మ, బట్టారం వంశీకృష్ణ శర్మ, అశోక్ మిశ్రా ల ఆధ్వర్యంలో పూజలు నిర్వహించనున్నారు. పూజల వివరముల కొరకు దేవాలయ మేనేజర్ బచ్చు పురుషోత్తం సెల్:8341816141 ను సంప్రదించవచ్చు.

# సూర్యాపేట నుండి బుల్లెట్ ట్రైన్ వెళ్లే వరకు పోరాడుదాం... సాధించి తీరుదాం


భానుపురి /సూర్యాపేట టౌన్



సూర్యాపేటకు రైలు మార్గం అనేది ప్రజల కల అని నేడు బుల్లెట్ ట్రైన్ రూపంలో ఆ కల సాకారమవుతున్న తరుణంలో మొదట సూర్యాపేటకు కేటాయించిన బుల్లెట్ ట్రైన్ అలైన్మెంట్ను మరో చోటకు మార్చడం తగదని బీఆర్ఎస్ మున్సిపల్ ఫ్లోర్ లీడర్ అంగిరేకుల నాగార్జున, మాజీ జిల్లా గ్రంధాలయ సంస్థ చైర్మన్ నిమ్మల శ్రీనివాస్ గౌడ్ లు అన్నారు. సూర్యాపేటకు బుల్లెట్ ట్రైన్ కోసం బుల్లెట్ ట్రైన్ సాదన అఖిలపక్షాల ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న రిలే నిరాహారదీక్షల్లో 14వ రోజు కూర్చున్న ఐద్వా మహిళలకు బీఆర్ఎస్ పట్టణ మున్సిపల్ కౌన్సిలర్లు సంఘీభావం తెలిపిన సందర్భంగా వారు మాట్లాడారు. సూర్యాపేటకు బుల్లెట్ ట్రైన్ సాధించేందుకు ఉద్యమం ఉవ్వెత్తున సాగుతుందని బుల్లెట్ ట్రైన్ వచ్చే వరకు వెనక్కు తగ్గేది లేదన్నారు. సూర్యాపేటకు రైలు ప్రజల కల అని దాన్ని సాదించే వరకు నిర్వహించే ఏ పోరాటానికైనా తమ పార్టీ పూర్తి మద్దతు ఉంటుందన్నారు. రాష్ట్రంలోని 33జిల్లాలో సూర్యాపేట జిల్లాకు మాత్రమే రైలు మార్గం లేదని అందుకే ఈ ప్రాంతం అన్ని రంగాల్లో వెనుకబడిందన్నారు. ప్రస్తుతం మనకు కేటాయించిన బుల్లెట్ ట్రైన్ అలైన్మెంట్ను మార్చారని తిరిగి దాన్ని మనం సాధించకుంటే ఇంకెప్పటికి మనకు రైలు వచ్చే అవకాశం లేదన్నారు. రాజకీయాలకతీతంగా ప్రజాప్రతినిధులు, నాయకులు స్పందించి కేంద్ర, రాష్ట్ర ప్రబుత్వాలకు విజ్ఞప్తులు చేసి సూర్యాపేటకు బుల్లెట్ ట్రైన్ తీసుకొచ్చి ప్రజల స్వప్నాన్ని సాకారం చేయాలన్నారు. ఈ దీక్షల్లో ఐద్వా రాష్ట్ర ప్రదాన కార్యదర్శి మల్లు లక్ష్మి, జిల్లా కార్యదర్శి ఎల్గూరి జ్యోతితో పాటు పలువురు మహిళలు కూర్చోగా మున్సిపల్ కౌన్సిలర్లు గండూరి కృపాకర్, బత్తుల రమేష్, ఈద ప్రవీణ్, తాహేర్, బానోతు సైదులు, లింగానాయక్, పోతురాజు ఇందుశ్రీ అనిల్, విజయనాయక్, చిరివెళ్ళ శభరీ, దంతాల సందీప్, మాజీ మార్కెట్ చైర్మన్ పెద్దిరెడ్డి రాజా, భూపతి రాములు, సట్టు నాగయ్య, రమణాచారి ఉన్నారు.

# డ్రైవర్ల సమస్యలు పరిష్కరించాలి

భానుపురి /సూర్యాపేట టౌన్



కాంగ్రెస్ ప్రభుత్వం డ్రైవర్ల సంక్షేమాన్ని పట్టించుకోవడం లేదని మాజీ మంత్రి, సూర్యాపేట ఎమ్మెల్యే గుంటకండ్ల జగదీష్‌రెడ్డి, మాజీ ఎమ్మెల్యే గాదరి కిషోర్‌కుమార్ లు అన్నారు. గురువారం జిల్లా కేంద్రంలోని మన్నెం సదాశివారెడ్డి ఫంక్షన్ హాల్‌లో బీఆర్ఎస్ ప్రభుత్వ హయాంలో 2015లో అప్పటి ముఖ్యమంత్రి కేసీఆర్ డ్రైవర్ల కోసం అమలు చేసిన ప్రమాద బీమా పథకంలో భాగంగా తుంగతుర్తి నియోజకవర్గం మద్దిరాల మండలం పోలుమల్ల గ్రామానికి చెందిన కొడవలికంటి యాకయ్య కుటుంబ సభ్యులకు 5 లక్షల బీమా చెక్కును బీఆర్టీయూ రాష్ట్ర ఉపాధ్యక్షులు గౌడ్‌చర్ల సత్యనారాయణ ఆధ్వర్యంలో అందించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ ప్రస్తుతం అధికారంలో ఉన్న కాంగ్రెస్ ప్రభుత్వం డ్రైవర్ల సంక్షేమాన్ని పట్టించుకోవడం లేదని వారు విమర్శించారు. డ్రైవర్ల సంక్షేమాన్ని దృష్టిలో ఉంచుకుని బీఆర్ఎస్ ప్రభుత్వం ప్రమాద బీమా పథకాన్ని అమలు చేసిందన్నారు. డ్రైవర్ల కుటుంబాలకు ఆర్థిక భరోసా కల్పించేందుకు ఈ పథకం ఎంతగానో ఉపయోగపడిందని తెలిపారు. ప్రస్తుతం కాంగ్రెస్ ప్రభుత్వం డ్రైవర్ల సమస్యలను పట్టించుకోకుండా నిర్లక్ష్యం చేస్తోందని ఆరోపించారు. డ్రైవర్ల సంక్షేమం కోసం ప్రభుత్వం తగిన చర్యలు చేపట్టాలని వారు డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో మండల పార్టీ అధ్యక్షుడు రజాక్, గ్రామ శాఖ అధ్యక్షుడు రేసు వెంకన్న, మధు, లింగారెడ్డి, వినోద్, మల్లారెడ్డి, వారి కుటుంబ సభ్యులు తదితరులు పాల్గొన్నారు.

# సెప్టెంబర్ 8,9 తేదీల్లో జరిగే ఏఐకేఎంఎస్ మహాసభలను జయప్రదం చేయండి

భానుపురి /సూర్యాపేట టౌన్

సెప్టెంబర్ 8,9 తేదీల్లో మంచిర్యాలలో జరిగే అఖిల భారత రైతు కూలీ సంఘం. (ఏఐకేఎంఎస్) తెలంగాణ రాష్ట్ర మహాసభలను జయప్రదం చేయాలని సూర్యాపేట జిల్లా కేంద్రంలోని చంద్ర పుల్లారెడ్డి విజ్ఞాన కేంద్రంలో అఖిల భారత రైతు కూలీ సంఘం. (ఏఐకేఎంఎస్) సూర్యాపేట జిల్లా కార్యవర్గం ఆధ్వర్యంలో పోస్టర్ ఆవిష్కరించడం జరిగింది. ఈ సందర్భంగా ఏఐకేఎంఎస్ రాష్ట్ర సహాయ కార్యదర్శి ఎం.డేవిడ్ కుమార్ మాట్లాడుతూ..భారత వ్యవసాయ రంగం తీవ్ర సంక్షేమ స్థితిని ఎదుర్కొంటుందని దీని అంతటికి కారణం భారత పాలకవర్గాలు అనుసరిస్తున్న రైతంగ వ్యతిరేక విధానాలు, సరళీకరణ ఆర్థిక విధానాలే కారణమని ఆయన అన్నారు. భారత ప్రభుత్వం ఢిల్లీ రైతాంగ పోరాటాల సందర్భంగా ఇచ్చినటువంటి హామీలను అమలు చేసే కార్యచరణ ఇంతవరకు చేపట్టకపోవడం రైతన్న యేడల వారికున్న చిత్తశుద్ధి తెలియజేస్తుంది. అనేక సామ్రాజ్యవాద దేశాలతో పాలకవర్గాలు చేసుకుంటున్న అసమాన ఒప్పందాలు మూలంగా వ్యవసాయ ఉత్పత్తులకు గిట్టుబాటు ధర రావట్లేదని, లేదా కనీసం మద్దతు ధర రావట్లేదు దీనంతటికీ కారణం భారత ప్రభుత్వం, 32 దేశాలతో కుదిరించుకున్న ఒప్పందాలు, ముఖ్యంగా అమెరికాతో కుదిరించుకున్న ఒప్పందాలు, రైతంగానికి గుదిబండగా మారబోతున్నాయి. తక్షణం ఈ అసమాన ఒప్పందాలను రద్దు చేసుకోవాలని ఆయన డిమాండ్ చేశారు. బహుళ జాతి కంపెనీలు ఉత్పత్తి చేస్తున్న విత్తనాలు వలన రైతులకు తీవ్ర నష్టం జరుగుతుంది. నకిలీ విత్తనాలు, అవే కాకుండా పర్మిషన్ లేకుండా కోట్లాది రూపాయల వ్యాపారం జరుగుతోంది దీని అరికట్టాల్సిన బాధ్యత ప్రభుత్వాలపై ఉంది. రాబోయే మహాసభలలో భారత రైతులు ఎదుర్కొంటున్న అనేక సమస్యలపై చర్చించి భవిష్యత్తు కర్తవ్యాలను రూపొందించుకొని బలమైన రైతు కూలీ ఉద్యమాన్ని నిర్మించి పాలకుల తప్పుడు విధానాలకు వ్యతిరేకంగా ఉద్యమిస్తామని తెలిపారు. ఈ కార్యక్రమంలో రాష్ట్ర నాయకులు పోటు లక్ష్మయ్య జిల్లా అధ్యక్ష కార్యదర్శులు కునుకుంట్ల సైదులు,బొడ్డు శంకర్, జిల్లా నాయకులు అలుగుబెల్లి వెంకట్ రెడ్డి, మేకల కనకారావు భయ్యా లింగయ్య,జిలేరు, సంజీవరెడ్డి, మైబెల్లి, జాజుల సామేలు, దాసరి శ్రీను, నాగయ్య, తదితరులు పాల్గొన్నారు.



## అఖిలభారత యువజన సమాఖ్య రాష్ట్ర మూడవ మహాసభలను జయప్రదం చేయండి



భానుపురి/సూర్యాపేట టౌన్

యాదాద్రి భువనగిరి జిల్లాలో జరగనున్న అఖిల భారత యువజన సమాఖ్య తెలంగాణ రాష్ట్ర మూడవ మహాసభలను జయప్రదం చేయాలని సిపిఐ పట్టణ కార్యదర్శి బూర వెంకటేశ్వర్లు పిలుపునిచ్చారు.. గురువారం జిల్లా కేంద్రంలో అఖిల భారత యువజన సమాఖ్య పట్టణ కౌన్సిల్ సమావేశంలో ముఖ్యఅతిథిగా పాల్గొని మాట్లాడుతూ దేశ భవిష్యత్తు యువత చేతుల్లోనే ఉందని, యువత ఎదుర్కొంటున్న నిరుద్యోగం, ఉపాధి అవకాశాల కొరత, విద్యా సమస్యలు, ప్రభుత్వ ఉద్యోగాల భర్తీ, సామాజిక న్యాయం, యువత హక్కులు వంటి అనేక సమస్యలపై మహాసభల్లో సమగ్రంగా చర్చించి భవిష్యత్ ఉద్యమ కార్యాచరణను రూపొందించనున్నట్లు తెలిపారు. ప్రభుత్వ రంగాన్ని బలోపేతం చేయడంతో పాటు ఖాళీగా ఉన్న ప్రభుత్వ ఉద్యోగాలను భర్తీ చేయాలని, యువతకు నాణ్యమైన విద్య, ఉపాధి, స్వయం ఉపాధి అవకాశాలు కల్పించాలని డిమాండ్ చేశారు. యువతను మత్తు పదార్థాలు, నిరాశ, నిరుద్యోగం వైపు నెట్టకుండా వారికి మెరుగైన భవిష్యత్తు కల్పించే విధానాల కోసం ఉద్యమాలను మరింత ఉధృతం చేయాల్సిన అవసరం ఉందన్నారు.


# మూడో విడత ఐటిఐ అడ్మిషన్లకు నోటిఫికేషన్ జారీ

భానుపురి /సూర్యాపేట

జిల్లాలో ప్రభుత్వ ఏటిసి ఐదు ప్రైవేటు ఐటిఐ కళాశాల యందు 2026, 2027 సంవత్సరానికి గాను వాక్ ఇన్ అడ్మిషన్ నోటిఫికేషన్ జారీ చేయడం జరిగిందని ఆసక్తి గల విద్యార్థులు ఈ నెల 25 నుంచి వచ్చే నెల 05 వరకు ఆన్ లైన్ రిజిస్టర్ చేసుకోవాలని, ఈనెల 29నుంచి వచ్చే నెల 5 వరకు వారు ఎంచుకున్న ప్రైవేటు/ప్రభుత్వ ఐటిసీలో అడ్మిషన్ పొందాలని జిల్లా కన్వినర్ ప్రిన్సిపాల్ జంజిరాల వెంకన్న గురువారం ఒకప్రకటన లో కోరారు. మొదటి విడత, రెండవ విడత, వఅ ఫ్ట్రిజూం:// ఊఅ .ॱవశ్రీఖఅస్త్రుఖఆఖ. స్త్రశీజ.ఆఅ వెబ్ సైట్లో అప్లై చేసుకున్న వారు తిరిగి రిజిస్ట్రేషన్ చేసుకో నవసరం లేదని పేర్కొన్నారు. కొత్తగా రిజిస్ట్రేషన్ చేసుకోనవసరం లేదు. రిజిస్టర్ చేసుకున్న విద్యార్థులు, తాము ఎంచుకన్న ఐటిఐ యందు ప్రతి రోజు ఉదయం 11.00 గం॥, లోపు హాజరు కావాలని, మధ్యాహ్నం 1.00గ॥ల తరువాత అడ్మిషన్ పొందాలని కోరారు. విద్యార్థిని, విద్యార్థులు రిజిష్టషన్ సమయంలో వారి పేరు, తండ్రి పేరు, తల్లి పేరు, ఎస్ఎస్సి సర్టిఫికెట్ ప్రకారం ఉండేల జాగ్రత్త పడాలని, ప్రస్తుత పాస్ పోర్టు సైజ్ ఫోటో మాత్రమే వాడాలని తెలిపారు.

ఆప్లికేషన్ చేసు కున్న వారు ఈనెల 29 నుంచి వచ్చే నెల 5 తేదీ వరకు వారు ఎంచుకున్న ఐటిఐ యందు అన్ని ఒరిజనల్స్ ఒక సెట్ జిరాక్స్ కాపీ పత్రాలను ఉదయం 9.00గంటల నుంచి 11.00 గంటల లోపు హాజరు కావాలని, మిగత వివరముల కొరకు దగ్గరలో ఉన్న ఐటిఐ కళాశాలను సంప్రదించాలని తెలిపారు.

## జానపద కళాకారులను ప్రభుత్వం ఆదుకోవాలి



భానుపురి /సూర్యాపేట టౌన్

సమాజంలో చైతన్యం తీసుకొస్తున్న కళాకారులను ప్రభుత్వం ఆదుకోవాలని తెలంగాణ రాష్ట్ర జానపద కళాకారుల సంఘం అధ్యక్షులు వంగ శ్రీనివాస్ గౌడ్, ప్రధానకార్యదర్శి సుంచు లింగన్న, అన్నారు. కళాకారులు వివిధ వేషాధారణలో పట్టణంలో ర్యాలీ నిర్వహించిన అనంతరం జిల్లా కేంద్రంలోని పబ్లిక్ క్లబ్ లో గురువారం తెలంగాణ ప్రభుత్వం భాషా సాంస్కృతిక శాఖ సౌజన్యంతో తెలంగాణ రాష్ట్ర జానపద కళాకారుల సంఘం ఉమ్మడి నల్లగొండ జిల్లా కమిటీ ఆధ్వర్యంలో జిల్లా అధ్యక్షులు గుండ్ల ఆంజనేయులు అధ్యక్షతన ప్రపంచ జానపద దినోత్సవ వేడుకలు అంగరంగ వైభవంగా నిర్వహించారు. ఈ కార్యక్రమానికి వారు ముఖ్యఅతిథిగా హాజరై జ్యోతి ప్రజ్వలన చేసి వేడుకలను ప్రారంభించి మాట్లాడారు.సమాజంలో రోజురోజుకీ కనుమరుగవుతున్న కళలను ప్రభుత్వం ప్రోత్సహించాలని కళలనే నమ్ముకొని వృత్తిగా కొనసాగిస్తున్న కళలను కాపాడు కోవాల్సిన బాధ్యత కళాకారులపై ఉందని చెప్పారు. ప్రభుత్వ కళాకారులకు ఐడి కార్డ్స్, ఉచిత బస్సు పాస్ సౌకర్యం, పెన్షన్, ఇందిరమ్మ ఇండ్లు, హెల్త్ కార్డ్స్ ప్రభుత్వ కార్యక్రమాల్లో అవకాశం కల్పించి, కళలనే వృత్తిగా జీవనం కొనసాగిస్తున్న కళలను బతికించి వారికి ఉపాధి కల్పించాలని డిమాండ్ చేశారు. 2014 లో తెలంగాణ రాష్ట్రం ఏర్పడి నాటి నుంచి కళలకు శ్రీకారం చుట్టిందని పేర్కొన్నారు.

## యూత్ కాంగ్రెస్ నాయకులకు నామినేట్ పదవులలో అవకాశం కల్పించాలి






భానుపురి /తుంగతుర్తి

తుంగతుర్తి నియోజకవర్గం నూతనకల్ మండల కేంద్రంలో యువజన కాంగ్రెస్ అధ్యక్షులు పసుల అశోక్ యాదవ్ ఆధ్వర్యంలో నిర్వహించిన జిల్లా, నియోజకవర్గ, మండల సమీక్ష సమావేశ కార్యక్రమానికి జిల్లా యువజన కాంగ్రెస్ అధ్యక్షులు ఎలిమినేటి అభినయ్ తుంగతుర్తి యువజన కాంగ్రెస్ అధ్యక్షులు కోరుకొప్పుల నరేష్ గౌడ్ ముఖ్య అతిథిలు గా హాజరై యువజన కాంగ్రెస్ చేపట్టవలసిన కార్యక్రమాలకు దిశా నిర్దేశం చేసి,పలు అంశాలపై చర్చించడం జరిగింది. దీనిలో భాగంగా యూత్ కాంగ్రెస్ గ్రామ కమిటీలు, మండల కమిటీలు నాయకులందరికీ భాగ స్వామ్యంతో కమిటీలు వేయాలని, యూత్ కాంగ్రెస్ నాయకులకు రాబోయే ఎన్నికల్లో, నామినేటెడ్ పదవులలో భాగస్వామ్యం కల్పించాలని కోరారు. అదే విధంగా గ్రామస్థాయిలో ప్రభుత్వ పథకాలను, కాంగ్రెస్ ప్రజా పాలన గురించి ప్రజలకు వివరిం చాలని కోరారు, పార్టీకి పనిచేస్తేనే గుర్తింపు లభిస్తుం దని అన్నారు. ఈ కార్యక్రమంలో జిల్లా నాయకులు శ్రావ్యసుధీర్ రెడ్డి, విజయ భాస్కర్ సూర్యాపేట,కోదాడ ,హుజూర్ నగర్ నియోజకవర్గ అధ్యక్షులు జావిద్ బేగ్,అజీమ్ , మహేష్ వివిధ మండలాల అధ్యక్షులు సమీర్, అనిల్, నరేష్, యూత్ కాంగ్రెస్ నాయకులు పాల్వాయి కార్తీక్ , బోల్క సైదులు, కొరివి గంగయ్య, మరికంటి అశోక్, ఉప్పల మురళి, శ్రీధర్ నాయక్ తదితరులు పాల్గొనడం జరిగింది....

## నూతన వధూవరులను ఆశీర్వదించిన డాక్టర్ పూరి సురేష్ శెట్టి



భానుపురి/ వనపర్తి

వనపర్తి పట్టణ సమీపంలో నాగవరం గ్రామంలో పద్మావతి శ్రీనివాస కళ్యాణం మండపం నందు గురువారం డాక్టర్ పూరి సురేష్ శెట్టి చిన్న నాటి మిత్రుడు పెద్దింటి లక్ష్మి నీలం గౌడ్ కుమారుడు చంద్రకాంత్, సింధు కళ్యాణము అంగరంగ వైభవంగా జరిగింది. ఈ కార్యక్రమానికి శ్రీ వాసవి సేవా సమితి జాతీయ అధ్యక్షుడు డాక్టర్ పూరి సురేష్ శెట్టి హాజరై నూతన దంపతులను ఆశీర్వదించారు.

# నకిలీ వైద్యుల ముసుగులో...

భానుపురి /సూర్యాపేట ప్రతినిధి

వైద్యో నారాయణో హరి... వైద్యుడంటే ప్రాణదాత.రోగిని ప్రేమగా పలకరిస్తే సగం రోగం నయమవుతుంది.

ఆ నమ్మకాన్ని కొందరు నకిలీ వైద్యులు వ్యాపారంగా మార్చుకుంటున్నారు.

రోగుల భయాన్ని ఆసరాగా చేసుకుని దోచుకుంటున్నారు

డబ్బు కోసం అమాయకుల ప్రాణాలతో చెలగాటమాడుతున్నారు.

కుటుంబాలను ఆర్థికంగా, మానసికంగా కుంగదీస్తున్నారు.

మెడలో స్టెతస్కోప్, తెల్లని దుస్తులు వేసుకునితీయని మాటలతో మాయచేసే మోసగాళ్లు పెరుగుతున్నారు.

చదువు, అర్హత లేకున్నా వైద్యుల ముసుగులో తిరుగుతూ..పల్లెల నుంచి పట్టణాల వరకు ప్రజల నమ్మకాన్ని వమ్ము చేస్తున్నారు.

వారి దురాగతాలతో నిజమైన వైద్యుల గౌరవానికీ మచ్చ పడుతోంది.తులసి వనంలో గంజాయి మొక్కలు మొలిచినట్టుగా పరిస్థితి మారుతోంది.

హాస్పిటల్ పేరు వినగానే రోగికి భయం కలిగే దుస్థితి రాకూడదు.వైద్యం సేవగా ఉండాలి...

సంపాదనకు మాత్రమే సాధన కాకూడదు.

రోగి ప్రాణం కంటే విలువైన సంపద మరొకటి లేదు.నిజమైన వైద్యుడు మందుతో పాటు మనోధైర్యాన్ని కూడా అందిస్తాడు.

"నీకు నేనున్నాను" అనే మాట రోగికి కొండంత బలాన్నిస్తుంది.

అలాంటి పవిత్ర వృత్తిని కొందరు కలుషితం చేయడం బాధాకరం.

ప్రేమించే పెదవుల చాటున విషం దాగితే నమ్మకం ఎలా నిలుస్తుంది?

నకిలీ వైద్యుల మోసాలను ప్రజలు అప్రమత్తంగా గుర్తించాలి.అర్హతలేని వైద్యులపై చట్టపరమైన చర్యలు తప్పనిసరి.ప్రజల ప్రాణాలతో ఆడుకునే వారికి కఠిన శిక్ష పడాలి.

నిజాయితీగా సేవ చేసే వైద్యులను మనసారా గౌరవిద్దాం.వైద్య వృత్తి పవిత్రతను కాపాడటం అందరి బాధ్యత.

ప్రాణం ముందు డబ్బు కాదు... మానవత్వమే మహోన్నతం!



మిత్రాజి
గుండవరం ప్రభాకర్ రావు పంతులు
ఫోన్ నం. 9949267638
అత్వెల్లి గ్రామం, మేడ్చల్ జిల్లా.

## శ్రీ వాసవి రక్షణ కవచం లో బాగ స్వామ్యం కండి. .పేద ఆర్యవైశ్యులకు ప్రోత్సాహం అందించండి



భానుపురి /సూర్యాపేట టౌన్

సూర్యాపేట పేద ఆర్యవైశ్యులను ఆదుకునే దిశగా శ్రీ వాసవి రక్షణ కవచం లో సూర్యాపేట ఆర్యవైశ్యులు భాగస్వామ్యమై, పేద ఆర్యవైశ్యులకు ప్రోత్సాహాన్ని అందించాలని శ్రీ వాసవి సేవా సమితి సూర్యాపేట జిల్లా అధ్యక్షులు బచ్చు పురుషోత్తం గురువారం ఒక్క ప్రకటనలో తెలిపారు.ఇందులో భాగస్వామ్యం కావడానికి ఆర్యవైశ్యులు కేవలం నెలకు 100 రూపాయలు ప్రతి నెల చెల్లించాలన్నారు. ప్రతి నెల ఒకటో తారీకు నుండి పదవ తారీకు లోపు వచ్చిన నగదు ఆ నెల 15వ తారీకు లోపు ఒక పేద ఆర్యవైశ్యుడిని గుర్తించి ఇవ్వడం జరుగుతుందన్నారు.సుమారుగా 100 మంది తోటి మొదటగా ప్రారంభించడం జరుగుతుందనీ తెలిపారు.పేద ఆర్యవైశ్యులకు సహాయం చేయాలని ఆసక్తి కలవారు సెల్: 9848022520 కు ఫోన్ పే ద్వారా చెల్లించవచ్చు అని తెలిపారు.

# ఆడబిడ్డ మనసు గాయపడింది'..

-నాకూ ఆత్మగౌరవం ఉంటుంది..

-రాఖీ పండుగ పూట కవిత ఎమోషనల్ కామెంట్స్

భానుపురి/హైదరాబాద్

రక్షా బంధన్ (రాఖీ పండుగ) వేళ తెలంగాణ రాజకీయాల్లో ఊహించని పరిణామం చోటుచేసుకుంది. తన సోదరుడు, బీఆర్ఎస్ కార్యనిర్వాహక అధ్యక్షుడు కేటీఆర్ తీరుపై టీఆర్ఎస్ పార్టీ అధినేత్రి, మాజీ ఎంపీ కల్వకుంట్ల కవిత సంచలన వ్యాఖ్యలు చేశారు. పండుగ రోజున కేటీఆర్ అందుబాటులో లేకపోవడంపై ఆమె తీవ్ర తీవ్ర అసంతృప్తి వ్యక్తం చేశారు. పండుగ సందర్భంగా మీడియాతో మాట్లాడిన కవిత, సోదరుడి వ్యవహార శైలిపై మనస్తాపం చెందారు. "గత ఏడాది రాఖీ పండుగ సమయంలో ఆయన నగరంలో లేకుండా వెళ్లిపోయారు. కానీ ఈసారి ఏకంగా దేశంలోనే లేకుండా పారిపోయారు" అని తీవ్ర వ్యాఖ్యలు చేశారు. పండుగ రోజున అన్నకు రాఖీ కట్టలేకపోవడంపై తన ఆవేదనను వెళ్లగక్కారు.

### నాకూ ఆత్మగౌరవం ఉంటుంది..

కుటుంబంలోనూ, రాజకీయాల్లోనూ జరుగుతున్న పరిణామాలపై స్పందిస్తూ.. "ఒక ఆడబిడ్డగా నాక్కూడా ఆత్మగౌరవం ఉంటుంది. ఆయన ప్రవర్తించిన తీరుతో నేను కూడా చాలా హర్ట్ అయ్యాను" అని పేర్కొన్నారు. రాఖీ పండుగ అనేది పవిత్రమైన రక్తసంబంధానికి సంకేతమని, దానిని రాజకీయాలతో ముడిపెట్టకూడదని హితవు పలికారు. "రాఖీ అంటే రక్తసంబంధం.. రాజకీయం కాదు" అని ఆమె స్పష్టం చేశారు. కాగా, రాఖీ పండుగ పూట కవిత చేసిన ఈ వ్యాఖ్యలు ఇప్పుడు తెలంగాణ రాజకీయ వర్గాల్లో తీవ్ర కలకలం రేపుతున్నాయి.

